
సాక్షి
బాపట్ల
ఆదివారం । 27 । ఏప్రిల్ । 2025



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 514.50 అడుగుల వద్ద ఉంది. ఇది 139.4380 టీఎంసీలకు సమానం.



రెడ్డి పేరంటాలమ్మకు పూజలు

నాదెండ్ల: సాతులూరులోని రెడ్డి పేరంటాలమ్మ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. గత నెల 17న ఈ ఆలయాన్ని రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించి ప్రతిష్ట నిర్వహించారు.

ప్రిన్సిపల్ జడ్జిని కలిసిన కలెక్టర్




నరసరావుపేట: స్థానిక కోర్టు ప్రాంగణానికి శనివారం విచ్చేసిన గుంటూరు జిల్లా ప్రిన్సిపల్ జడ్జి సాయికల్యాణ చక్రవర్తిని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మర్యాద పూర్వకంగా కలిశారు.

రేషన్ నేరాలు

యథేచ్ఛగా కూటమి నేతల దందా

- పోటీలు పడి రేషన్ బియ్యం అక్రమ రవాణా
- నేరాలకు దారి తీస్తున్న కార్యకలాపాలు
- తాజాగా ఒంగోలులో పచ్చ నేత హత్య
- జిల్లాలోనూ పతాకస్థాయికి బియ్యం దందా
- పోటీలు పడుతున్న పచ్చ నేతలు
- అక్రమాల మాటున నేరాలకు అవకాశం



సాక్షి ప్రతినిధి,బాపట్ల: పచ్చనేతల అక్రమాలు నేరాలకు దారితీస్తున్నాయి. తద్వారా ఏకంగా హత్యా ఘటనలూ చోటు చేసుకుంటున్నాయి. తాజాగా బాపట్ల పార్లమెంట్ పరిధిలోని నాగులుప్పపాడు మండలానికి చెందిన టీడీపీ నేత, మాజీ ఎంపీపీ వీరయ్య చౌదరి హత్యకు గురికావడం సంచలనం సృష్టించింది. వీరయ్య చౌదరి హత్యకు రేషన్ దందా కారణం అయివుండవచ్చని అనుమానించిన పోలీసులు ఆ దిశగా విచారణ చేసి కొందరు రేషన్ మాఫియా సభ్యులను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. బాపట్ల మండలం వెదుళ్లపల్లికి చెందిన రైస్ మిల్లు యజమాని సుధీర్‌తోపాటు పొన్నూరుకు చెందిన పలువురు బియ్యం వ్యాపారులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. రేషన్‌తోపాటు మద్యం సిండికేట్, ఇసుక దందా, ల్యాండ్ సెటిల్‌మెంట్లు ఈ హత్యకు కారణమన్న ప్రచారం ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో జోరుగా సాగుతోంది. మొత్తంగా అక్రమార్జన, ఆధిపత్య పోరు హత్యకు కారణమని ప్రచారం జరుగుతుంది.

పచ్చనేతల అక్రమాలపై చర్చ

వీరయ్య హత్య ఉదంతం, పచ్చనేతల అక్రమ కార్యకలాపాలు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. కూటమి అధికారంలోకి వచ్చాక బాపట్ల జిల్లాలో చౌక బియ్యం దందా జోరుగా సాగుతోంది. పచ్చనేతలకు బియ్యం వ్యాపారం ప్రధాన ఆదాయ వనరుగా మారింది. ప్రారంభంలో ఒక్కో ఎమ్మెల్యేకు నెలకు రూ.8 నుంచి రూ.10 లక్షలు ఇచ్చిన రేషన్ మాఫియా ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.25 లక్షలకు పెంచింది. అంతకుమించిన మొత్తాన్ని మేమిస్తామంటూ ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన మాఫియా పోటీలు పడుతోంది. మంత్రి గొట్టిపాటి రవికుమార్ అనుచరులు ఇప్పుడు బియ్యం వ్యాపారంలోనూ తమ హవా చాటుతున్నట్లు ప్రచారం వుంది. మాఫియా ఒంగోలు, మద్దిపాడు, సంతమాగులూరుతోపాటు పలు ప్రాంతాల్లో ఏకంగా రైస్‌మిల్లులు లీజుకు తీసుకొని చౌక బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తున్నారు. ఆ తర్వాత కృష్ణపట్నం పోర్టు నుంచి కొంత, గుజరాత్‌కు మరికొంత తరలిస్తున్నారన్నది బహిరంగమే. కిలో బియ్యం రూ.10 నుంచి రూ.12లకు కొని రూ.50 నుంచి రూ.70కి అమ్మి మాఫియా రూ.కోట్లు గడిస్తోంది. దీంతో మాఫియా ఎమ్మెల్యేలు, అధికారులకు అడిగినంత నెల మామూళ్లు చెల్లిస్తోంది.

పచ్చనేతల పోటీ వల్లే నేరాలు

రేషన్ దందా ప్రధాన ఆదాయ వనరుగా మారడంతో ఈ దందా నిర్వహించేందుకు పచ్చనేతలు పోటీపడుతున్నారు. మంత్రులు, కొందరు ఎమ్మెల్యేల అండతో రేషన్ దందాను యథేచ్ఛగా నడిపిస్తున్నారు. అద్దంకి బ్యాచ్ ప్రకాశం, పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో దందా నిర్వహిస్తోంది. కొద్దిపాటి అంగబలం ఉన్న స్థానిక పచ్చ నేతలూ రేషన్ దందాకు పోటీపడుతున్నారు. పర్చూరు, చీరాల, బాపట్ల, వేమూరు ప్రాంతాల్లో ఈ పోటీ అధికంగా వుంది. ఎమ్మెల్యేల అండతో స్థానిక నేతలు బయట నుంచి వచ్చిన బియ్యం మాఫియాను బెదిరిస్తుండగా మాఫియాకు చెందినవారు మంత్రులు, కొంతమంది ముఖ్యనేతల పేర్లు చెప్పి దందా మాదేనని సవాల్ విసురుతున్నారు. దీంతో స్థానిక పచ్చనేతలకు, బయట నుంచి వచ్చిన మాఫియాకు గొడవలు చెలరేగుతున్నాయి. చీరాల, బాపట్ల, వేమూరు, రేపల్లె, పర్చూరు ప్రాంతాల్లో ఈ తరహా గొడవలు జరుగుతున్నాయి. చాలాచోట్ల మాఫియాకు భయపడి స్థానిక నేతలు వెనక్కి తగ్గి చౌకబియ్యం వ్యాపారాన్ని మాఫియాకు కట్టబెడుతున్నారు. ఇది పచ్చ పార్టీలో అంతర్గత కుమ్ములాటకు దారితీస్తోంది. ఉదాహరణకు అద్దంకికి చెందిన మంత్రి అనుచరులు ఉమ్మడి ప్రకాశం, ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో రేషన్ మాఫియాను నడిపిస్తున్నారు. వారు మంత్రి పేరు చెప్పి బెదిరింపులకు దిగుతుండడంతో జిల్లాలకు చెందిన కొందరు ఎమ్మెల్యేల అనుచరులు రేషన్ దందాలో వెనక్కి తగ్గి మంత్రి అనుచరులకు అప్పగించాల్సి వస్తోంది. దీంతో స్థానిక పచ్చనేతలు మాఫియాపై కక్ష పెంచుకుంటున్నారు. బియ్యం దందాపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తూ మాఫియాకు చికాకులు తెప్పిస్తున్నారు. దీంతో పచ్చనేతల మధ్య విభేదాలు తలెత్తుతున్నాయి. అవి నేరాలకు దారితీస్తున్నాయి. నెల మామూళ్లు పుచ్చుకొని అటు పోలీసు, పౌరసరఫరాల అధికారులతోపాటు జిల్లా ఉన్నతాధికారులు రేషన్ దందాకు వత్తాసు పలుకుతుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో? ఎవరిపై ఎవరు దాడిలకు దిగుతారోనన్న ఉత్కంఠ నెలకొంది. నేరాలను కట్టడి చేయాల్సిన పోలీసులు తమకేమీ పట్టనట్లు మిన్నకుండి పోతున్నారన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా అధికారులు రేషన్ మాఫియాను కట్టడిచేసి నేరాలను అదుపుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

వసూలు చేసుకోండి.. పర్సంటేజీలు ఇవ్వండి

చీరాల డివిజన్ అధికారి వసూళ్ల తీరు

- గ్రామ పంచాయతీ తనిఖీకి వస్తే రూ.20 వేలు
- పంచాయతీ కార్యదర్శులపై ఆరోపణలు వస్తే కాసులు పంటే
- డిజవిజన్ అధికారి కారు డ్రైవర్ శానిటరీ మేస్త్రి

సాక్షి టాస్క్‌ఫోర్సు: అయినకాడికి వసూలు చేసుకోండి...మాకు మాత్రం పర్సంటేజీలు ఇవ్వండి అనే చందంగా చీరాల డివిజన్ స్థాయి గ్రామ పంచాయతీ అధికారుల తీరు తయారైంది. వారి వసూళ్ల దందా నిరాటంకంగా కొనసాగుతుంది. కార్యదర్శులు వసూళ్లు చేసి డివిజన్ స్థాయి అధికారులకు పర్సంటేజీలు ఇస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

ఇదీ డివిజన్ స్థాయిలో వసూళ్ల తీరు...

చీరాల డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాలు ఉన్నాయి. ఈ మండలాల పరిధిలో 110 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిల్లో మేజర్, మైనర్ గ్రామ పంచాయతీలు ఉన్నాయి. చీరాల డివిజన్ పరిధిలో గ్రామ పంచాయతీలకి డివిజన్ స్థాయి అధికారి విజిట్‌కి వస్తే ఆ పంచాయతీ కార్యదర్శుల జేబులు ఖాళీ అవుతున్నాయి. అధికారి వచ్చిన కారు ఆయిల్ ట్యాంక్ ఫుల్ చేయించాల్సి ఉంటుంది. ఆయన బయలుదేరే ముందు రూ.20 వేలు నగదు కవర్‌లో పెట్టి అందించాలని కార్యదర్శులే గుసగుసలాడుతున్నారు. పంచాయతీ కార్యదర్శిపై అవినీతి ఆరోపణలు వస్తే చాలు ఎవ్వరికీ తెలియకుండా అధికారి అక్కడ వాలిపోతాడు. ఆరోపణల ను బూసిగా చూపి పర్సంటేజీలు తీసుకుని అంతా సవ్యంగా ఉందని నివేదిక ఇచ్చి వెళుతుంటాడు.

శానిటరీ మేస్త్రే కారు డ్రైవర్

చీరాల డివిజన్ స్థాయి అధికారి కారు డ్రైవర్‌గా వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ శానిటరీ మేస్త్రి వ్యవహరిస్తున్నాడు. గడిచిన కొంత కాలంగా శానిటరీ మేస్త్రిని డివిజన్ స్థాయి అధికారి డిప్యూటేషన్‌పై తన కారు డ్రైవర్‌గా నియమించుకున్నాడు.

కార్యదర్శులపై అవినీతి ఆరోపణలు

వేటపాలెం మండలం పరిధిలోని అత్యధికంగా గ్రామ పంచాయతీ కార్యదర్శులపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. మేజర్ గ్రామ పంచాయతీ కొత్తపేట కార్యదర్శిపై అత్యధికంగా ఆరోపణలు వచ్చాయి. 19 నెలల కిందట రూ.1.70 కోట్లు నగదు గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ గ్రామ పంచాయతీలో పనిచేసే ఉద్యోగులే ఏకంగా జిల్లా అధికారికి ఫిర్యాదు చేశారు. అప్పట్లో డివిజన్ స్థాయి అధికారిని విచారణ నిమిత్తం నియమించారు. డివిజన్ అధికారి గ్రామ పంచాయతీకి వచ్చి విచారణ చేసి వెళ్లాడు. దానిపై ప్రస్తుత డివిజన్ అధికారి తిరిగి మార్చి నెలలో విచారణ చేపట్టారు. ఆ విచారణ ఏ స్థాయిలో ఉందో తెలియలేదు. కార్యదర్శిపై ఎలాంటి చర్యలు లేవు. విచారణకు వచ్చిన డివిజన్ అధికారికి పర్సంటేజీలు ఇచ్చి పంపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే రీతిలో వేటపాలెం గ్రామ పంచాయతీకి చెందిన ఇంటి పన్నుల తాలూకు వసూలు చేసిన డబ్బు పంచాయతీ బ్యాంకు ఖాతాలకు జమ చేయకుండా రూ.40 లక్షలు గోల్‌మాల్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. రామన్నపేట గ్రామ పంచాయతీలోనూ ఇదే పరిస్థితి. ఇంటి పన్నులు రూ.30 లక్షలు వసూలు చేసి గోల్‌మాల్ చేశారు. వీటిపై ఎటువంటి విచారణ జరగలేదు. కరోనా సమయం నుంచి ఆయా గ్రామ పంచాయతీల పరిధిలోని కూరగాయలు, చేపలు, మాంసం మార్కెట్‌లకు వేలం నిర్వహించకుండా కార్యదర్శులు జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కొత్తపేట కార్యదర్శిపై విచారణ

> కొత్తపేట గ్రామ పంచాయతీలో రూ.కోటి పైచిలుకు నిధులు గోల్‌మాల్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణ చేస్తున్నాం. ఇంకా రెండు పుస్తకాలు పరిశీలించాల్సి ఉంది. కార్యదర్శి ఇప్పటికే రూ.72 లక్షలు నగదు పంచాయతీకి జమ చేశాడు. ఇంకా జమ చేయాల్సిన నగదు ఉంది. పూర్తిస్థాయిలో విచారణ చేసిన తర్వాత ఎంత నగదు గోల్‌మాల్ జరిగింది అని ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తాను.
>
> – శివన్నారాయణ, డీఎల్‌పీఓ, బాపట్ల

న్యూస్‌రీల్

పాకిస్థాన్ పౌరులు వెంటనే వెళ్లిపోవాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో జిల్లాలో ఉన్న పాకిస్థాన్ పౌరులను తిరిగి పంపించేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ వీసాపై వచ్చిన వారు 27 లోగా, వైద్య వీసా పై ఉన్నవారు 29 లోగా ఈ దేశం విడిచి వెళ్ళాలని ఆయన సూచించారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో ఆర్డీవోలు పూర్తి బాధ్యతలు తీసుకుని పాకిస్థానీయులను పంపి వేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

బుద్ధిష్ట్ సర్క్యూట్ వద్ద అగ్నిప్రమాదం



అమరావతి: ప్రసిద్ధ పర్యాటక కేంద్రం అమరావతిలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బుద్ధ విగ్రహం ఎదురుగా కోట్లాది రూపాయలతో నిర్మించిన బుద్ధిష్ట్ సర్క్యూట్ భవనాల వద్ద శనివారం సాయంత్రం అగ్నిప్రమాద జరిగింది. పర్యాటక శాఖ మేనేజర్ మణికుమార్ అందించిన సమాచారం మేరకు ఓ ప్రైవేటు ఊరేగింపులో కాల్చిన బాణసంచా రవ్వలు బుద్ధిష్ట్ సర్క్యూట్ భవనాల సమీపంలో ఉన్న చెత్తలో పడి రాజుకుని మంటలు చెలరేగాయి. ఇది గమనించిన స్థానికులు మంటల అర్పటానికి ప్రయత్నించినా సాధ్యపడలేదు. ఈ క్రమంలో సత్తెనపల్లి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వటంతో అగ్నిమాపక వాహనం, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చారు. కోట్లాది రూపాయల భవనాలకు ఎటువంటి నష్టం జరగలేదు.

28, 29న డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కార్యక్రమం

నరసరావుపేట: తుఫాన్‌లు, వరదలు సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై అవగాహన నిమిత్తం దాచేపల్లి మండలం రామాపురంలో ఈనెల 28న టేబుల్‌టాప్ ఎక్సర్‌సైజ్, 29న ఫిజికల్ మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు.

అద్దంకమ్మ అమ్మవారి తిరునాళ్ల



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరులో అద్దంకమ్మ అమ్మవారి తిరునాళ్ల ఉత్సవాలు నేత్ర పర్వంగా జరుగుతున్నాయి. ఈ నెల 23 నుంచి మొదలైన ఉత్సవాల్లో తొలి రోజు మారెమ్మ కొలుపు, మర్నాడు పోలేరమ్మ కొలుపులు నిర్వహించారు. శనివారం కుంకుమ బండ్లుతో ఊరేగింపు చేపట్టారు. తిరునాళ్ల సందర్భంగా అమ్మవారి దేవస్థానం విద్యుత్ దీపాలతో ధగధగలాడుతుంది. స్థానికులు ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

30న పాలిసెట్

గుంటూరు నగరంలో 11 పరీక్ష కేంద్రాలు

గుంటూరు ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం ఉద్దేశించిన పాలిసెట్–2025 ఈనెల 30న జరగనుంది. పాలిసెట్‌కు జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసిన 4,030 మంది విద్యార్థులకు గుంటూరు నగరంలో 11 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరగనుండగా, విద్యార్థులు కనీసం గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంది. ఉదయం 11 గంటల తరువాత నిముషం ఆలస్యమైనా విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించబోమని అధికారులు ప్రకటించారు. వేసవి దృష్ట్యా పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ఫర్నిచర్ తదితర మౌలిక వసతులు కల్పించామని సెట్ సమన్వయకర్త, నల్లపాడు ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ టి. శేఖర్ తెలిపారు.

నేడు వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల రాష్ట్ర సదస్సు

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్) : ఏపీ స్టేట్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అడ్మిన్ సెక్రటరీల సమావేశం గుంటూరు నగరంలోని ఏపీ ఎన్జీవో కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఓర్సు రామకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

పంట కాలువల మరమ్మతులు చేయాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: జల వనరుల కింద పంట కాల్వల మరమ్మతులు, పునరుద్ధరణ పనులు వేగంగా చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. డీఆర్‌సీలో ప్రజా ప్రతినిధులు చర్చించిన అంశాలు, తీసుకున్న చర్యలపై శనివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. గుంటూరు ఛానల్, నల్లమడ కాల్వల అభివృద్ధి పనులు శరవేగంగా చేపట్టాలని కలెక్టర్ అన్నారు. జిల్లాలోని రైతుల శ్రేయస్సు కోసం ప్రజాప్రతినిధులు చర్చించిన అంశాలను అధికారులు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అద్దంకి నియోజకవర్గంలో మంజూరైన పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. గుంటూరు ఛానల్ విస్తరణకు నాలుగు ఎకరాల స్థలం భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికే రూ.15 కోట్ల నిధులు మంజూరు కావాలని ప్రభుత్వానికి నివేదిక పంపిన విషయాలపై సమీక్షించారు. మైనర్ కాల్వలపై 119 మరమ్మతు పనులకు రూ.10.68 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. ప్రస్తుతం అవన్నీ టెండర్ దశలో ఉన్నాయన్నారు. పంట కాల్వల మరమ్మతు పనులు, పూడికతీత పనులు చేయడానికి ప్రభుత్వం 454 పనులు గుర్తించిందన్నారు. యుద్ధప్రాతిపదిక వాటిని చేపట్టేందుకు రూ.12.59 కోట్ల నిధులు జిల్లాకు మంజూరయ్యాయన్నారు. వరద ప్రభావంతో దెబ్బతిన్న పంట కాల్వలకు తాత్కాలిక మరమ్మతులు చేయడానికి 148 పనులు గుర్తించామన్నారు. రూ.7.75 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ప్రస్తుతం వేసవి నేపథ్యంలో పంట కాల్వలు నీరు లేనందున మరమ్మతు పనులు వేగంగా ప్రారంభించాలన్నారు. వేసవి ముగిసేలోపు ఆ పనులను పూర్తి చేయాలని కలెక్టర్ చెప్పారు. రైతుల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ శాఖల్లో జరుగుతున్న పనులపై ప్రజా ప్రతినిధులు చర్చించిన అంశాలు, అధికారులు తీసుకున్న చర్యల గురించి ఆయన ఆరా తీశారు. సమావేశంలో సీపీఓ కె శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- మంత్రి అనగాని సత్యప్రసాద్
- మత్స్యకారులకు వేట నిషేధ భృతి చెక్కు అందజేత



మెగా చెక్కు అందజేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ వెంకట మురళి

నిజాంపట్నం/ రేపల్లె రూరల్: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ అన్నారు. రేపల్లె నియోజకవర్గం నిజాంపట్నం మండలం కొత్తపాలెం ఫిష్ లాండింగ్ సెంటర్ వద్ద శనివారం మత్స్యకారులకు వేట నిషేధ భృతి పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మత్స్యకారులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కష్టపడి జీవిస్తూ ఉంటారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ఎన్నికల సమయంలో మత్స్యకారులకు ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధభృతిని రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు.

మత్స్యకారులకు అవసరమైన వలలు, బోట్లు, మోటార్ సైకిళ్లను సబ్సిడీ కింద మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. సముద్రంలో చేపలు పొదుగు కాలం కావడంతో ఏప్రిల్ 15 నుంచి జూన్ 16వ తేదీ వరకు వేట నిషేధ కాలంగా ప్రభుత్వం ప్రకటించిందని చెప్పారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా రూ.20 వేలు ప్రభుత్వం ఇస్తుందని తెలియజేశారు. మరో వైపు ఆక్వా రంగం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన చెప్పారు. నిజాంపట్నం దుండి ప్రాంతాన్ని టూరిజం కేంద్రంగా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పర్యాటక కేంద్రంగా మడ అడవులు ప్రాంతం ...

జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి మాట్లాడుతూ మత్స్యకారులు వేట నిషేధ కాలం భృతిని సద్వినియోగం చేసు కోవాలని చెప్పారు. నిజాంపట్నం మడ అడవుల ప్రాంతాలను పర్యాటక కేంద్రంగా తయారు చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం బాపట్ల జిల్లాకు చెందిన 12,671 మంది మత్స్యకారులకు రూ.25 కోట్ల 34 లక్షల 20వేల మెగా చెక్కును మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాస్ నాయక్, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి విలియమ్స్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

న్యాయమూర్తులకు ఆత్మీయ వీడ్కోలు



చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తి రెహానను సత్కరిస్తున్న న్యాయవాదులు

చీరాల రూరల్ : చీరాల కోర్టులలో మూడేళ్లపాటు విధులు నిర్వర్తించి నెల్లూరు, విజయవాడ కోర్టులకు బదిలీపై వెళుతున్న న్యాయమూర్తులు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రెహన, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ నిషాద్‌నాజ్‌లను చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శనివారం రాత్రి ఘనంగా సత్కరించారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో న్యాయమూర్తులకు ఆత్మీయ వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడారు. మూడేళ్లపాటు ఇరువురు న్యాయమూర్తులు చీరాల కోర్టులలో ఎంతో ఓర్పుతో నేర్పుతో విధులు నిర్వర్తించి కక్షిదారులకు న్యాయ సహాయం అందించడంతో పాటు మంచి తీర్పులు అందించారని పేర్కొన్నారు. సీనియర్, జూనియర్ న్యాయవాదులు అనే తారతమ్యాలు లేకుండా ప్రతి ఒక్కరిని ఎంతో గౌరవంగా చూసేవారని చెప్పారు. అలానే కోర్టులో పనిచేసే న్యాయవాద గుమస్తాలు, కోర్టు సిబ్బంది, కోర్టు కానిస్టేబుళ్ల పట్ల ఎంతో మంచిగా వ్యవహరించారని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని పదోన్నతులు పొంది ఉన్నత స్థానాలను అలంకరించాలని న్యాయవాదులు ఆకాంక్షించారు. న్యాయవాదులు తమపై ఇంతటి ప్రేమ అనురాగాలు చూపడంపై న్యాయమూర్తులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు, ఉపాధ్యక్షుడు బండ్లమూడి విజయకుమార్, సెక్రటరి మేరుగ రవికుమార్, సభ్యులు నాశనరాము, ఆల్ఫ్రెడ్ రాజా సాల్మన్, సిరిపురం కామేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి, మహిళా ప్రతినిధి స్నేహ, న్యాయవాదులు ఎంవి. చలపతిరావు, కె. రవికుమార్ రెడ్డి, కె. రవి, ఎ. పుల్లయ్యనాయడు, ఆర్. రమేష్‌కుమార్, ఆర్. వెంకటేశ్వరరెడ్డి, బి. జయసన్‌బాబు, కె. ఉదయభాస్కరరావు, డి. పున్నయ్య, ఎస్. కస్తూరినాథ్, ఎస్‌కె. సిరాజ్, ఐ. గోపాలకృష్ణమూర్తి, ఎ. సతీస్‌రెడ్డి, పి. సాంబు, జె. శ్రీనాథ్, జి. సురేష్, డి. చైతన్య, ఎ. కొండయ్య, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రేక్షకులను అలరించిన నాటికలు

- మూడు రోజులపాటు సాగిన నాటికలు
- ముగిసిన పోటీలు



జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ ముత్తవరపు సురేష్బాబు, అరుణకుమారి



స్వేచ్ఛ నాటికలోని ఓ సన్నివేశం

మార్టూరు: శ్రీకారం రోటరీ కళాపరిషత్ ఆధ్వర్యంలో మార్టూరులో మూడు రోజులుగా నిర్వహించిన తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికల పోటీలు శనివారం రాత్రితో ముగిశాయి. పోటీలలో ప్రదర్శించిన ప్రతి నాటిక ప్రస్తుత సమాజంలో ఎక్కడో ఒకచోట ప్రేక్షకులకు ఎదురవుతున్న సమస్యల తాలూకు ఇతివృత్తాలే కావడంతో ప్రేక్షకాదరణకు నోచుకోవడం విశేషం. చివరిరోజైన శనివారం రాత్రి ప్రదర్శించిన మూడు నాటికలు ఒకదానితో మరొకటి పోటీ పడటం విశేషం. నాటిక ప్రదర్శనలకు ముందు వేదిక స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్ బాబు, అరుణకుమారిలు రోటరీ శ్రీకారం పరిషత్ ప్రతినిధుల ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేసి నాటికలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జె.వి.మోహనరావు, శ్రీకారం కార్యదర్శి జాష్టి అనురాధ, మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మద్దు మాల కోటేశ్వరరావు, మాదాల సాంబశివరావు పాల్గొన్నారు.

పరిమితులు లేని 'స్వేచ్ఛ' ప్రగతి నిరోధకం

సమాజంలోని ఇతరులకు భంగం కలిగించనంతవరకు స్వేచ్ఛ స్వాగతించదగినదే. అలా కాకుండా ఎవరికి వారు తమ ఇష్టానుసారం వ్యవహరిస్తామంటూ యథేచ్ఛగా వ్యవహరించటం ప్రారంభిస్తే అది సమాజ హితం కాబోదని పరిమితులు కలిగిన స్వేచ్ఛతోనే మానవ మనుగడకు శ్రేయస్కరమని నాటికలోని నటీనటులు పాత్రోచితంగా నటించి చూపారు. ఎటు గాలి వీస్తే అటువైపు ఎగిరే గాలిపటం దారమనే పరిమితి వలన మాత్రమే ఆకాశంలో అందంగా ఎగురుతూ కనిపిస్తుందని గాలిపటానికి ఆధారమైన 'ఆ దారము' తెగిన నాడు ఏ చెట్టు కొమ్మల్లోనో చిక్కుకుపోయి ఆగాలిపటం చిరిగిపోతుందని ప్రదర్శించిన స్వేచ్ఛ నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. స్వేచ్ఛ పేరిట నేటి తరం పాకులాడుతూ కుటుంబ వ్యవస్థల విచ్ఛిన్నానికి పాల్పడుతు న్న తీరును విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారు ప్రదర్శించిన స్వేచ్ఛ నాటికను పి. శివరాం రచించగా బి.ఎం రెడ్డి దర్శకత్వం వహించారు.

వివాహ వ్యవస్థపై సంధించిన బాణం

వివాహ వ్యవస్థపై సంధించిన బాణం 'విడాకులు కావాలి' మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అని, అందుకు భార్యాభర్తల మధ్య ఉండవలసిన వైవాహిక దాంపత్యానికి మినహాయింపు ఏమీ లేదంటున్న నేటి యువతకు కనువిప్పు కలిగించేలా ప్రదర్శించిన 'విడాకులు కావాలి' నాటిక ప్రేక్షకులను రక్తి కట్టించింది. ఆర్థికపరమైన స్వేచ్ఛలు పెరుగుతూచిన్నచిన్న కారణాలతోనే భార్యాభర్తల మధ్య తలెత్తే అభిప్రాయ భేదాలతో విడాకుల కోసం కోర్టుల చుట్టూ పరిగెత్తుతూ తమ పిల్లల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్న నేటి తల్లిదండ్రుల తీరును కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి నాటికను వల్లూరు శివప్రసాద్ రచించగా గంగోత్రి సాయి దర్శకత్వం వహించారు.

'బ్రహ్మ స్వరూపం'తో బరువెక్కిన హృదయాలు

సమాజంలోని ప్రతి మనిషి ప్రారంభంలో మంచితనంతో నిస్వార్థంగా, ఆత్మీయ అనురాగాలతో జీవించాలని ఇతరులు కూడా తన పట్ల అలాగే ఉండాలని కోరుకుంటాడు. వాస్తవ ప్రపంచంలో అది సాధ్యం కాక పెరిగిపోతున్న స్వార్థంతో మనిషి జీవితంలోకి ఊహకందని కష్టాలు, నష్టాలు ప్రవేశిస్తాయి. మనిషి అత్యంత కఠినమైన పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చిన సందర్భాలలో ఆ మనిషి నిస్సహాయుడైన వేళ సాక్షాత్తు ఆ బ్రహ్మ స్వరూపమే ఏదో ఒక రూపంలో సాక్షాత్కరించి ధర్మాన్ని గెలిపిస్తుందనే ఇతివృత్తంగా సాగిన నాటిక బ్రహ్మస్వరూపం.

మద్యం తాగి విద్యుత్ శాఖ అధికారి హల్‌చల్



మూల్పూరులో హల్‌చల్ చేస్తున్న విద్యుత్ శాఖాధికారి

అమర్తలూరు(వేమూరు): విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీరు మద్యం తాగి హల్‌చల్ చేసిన తీరు సామాజిక మాధ్యమాలలో వైరల్ మారింది. అమర్తలూరు మండలం విద్యుత్ కార్యాలయం అసిస్టెంట్ ఇంజినీరుగా నాంచారయ్య పని చేస్తున్నారు. మూల్పూరు గ్రామంలో ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో మద్యం తాగి వ్యక్తులపై ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ ప్రవర్తించిన దృశ్య రూపం ద్వారా బయటకు వచ్చింది. విద్యుత్ శాఖలో పనిచేసే సిబ్బంది 24 గంటలు విధులు నిర్వహించాల్సి ఉంది. విధుల్లో ఉన్న విద్యుత్ శాఖాధికారి ప్రవర్తన తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. ఈ వీడియో జిల్లా ఉన్నతాధికారులు దృష్టికి చేరినట్లు సమాచారం.

కంటైనర్‌ను ఢీకొన్న లారీ



మేదరమెట్ల: ఆగి ఉన్న కంటైనర్‌ను లారీ ఢీకొన్న సంఘటన 16వ నెంబరు జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. ఒంగోలు వైపు నుంచి గుంటూరు వైపు వెళుతున్న లారీ కొరిశపాడు మండల పరిధిలోని వెంకటాపురం జంక్షన్ వద్దకు రాగానే ముందు టైరు పగిలిపోవడంతో అదుపు తప్పి డివైడర్ ఎక్కింది. తరువాత ఒంగోలు వైపు వెళ్లే రహదారి పక్కన ఆగిఉన్న కంటైనర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ కాలు విరిగింది. ప్రమాదం జరిగిన సమయంలో లారీలో మరో ముగ్గురు ఉన్నారు. వీరికి ఎలాంటి గాయాలు కాలేదు. గాయపడిన డ్రైవర్‌ను హైవే అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మేదరమెట్ల పోలీసులు తెలిపారు.

నేడు గంగమ్మ తల్లి తిరునాళ్లు



కారంచేడులో ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి



తిరునాళ్ల ఏర్పాట్లపై కమిటీ సభ్యులతో చర్చిస్తున్న సీఐ వైవీ రమణయ్య

కారంచేడు: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా, సంతాన లక్ష్మిగా పేరొంది విరాజిల్లుతున్న గ్రామదేవత గంగమ్మ తల్లి తిరునాళ్లను ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మండల కేంద్రమైన కారంచేడు పుట్టాయిపాలెంలో కొలువైన అమ్మవారికి గత 37 సంవత్సరాలుగా శిడి మహోత్సవాలను కనుల పండువగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గత నాలుగు రోజుల నుంచి అమ్మవారికి వివిధ రకాల ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తూ, గ్రామస్తులు పెద్దఎత్తున నైవేద్యాలను సమర్పిస్తున్నారు. ఆదివారం వేకువజాము నుంచే అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరిస్తారు. గ్రామస్తులు ఎక్కడ ఉన్నా గ్రామానికి వచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కుబడులు తీర్చుకుంటారు. తిరునాళ్ల సందర్భంగా వివిధ ప్రాంతాలు, జిల్లాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉండనే ఉంటాయి.

పటిష్ట పోలీస్ బందోబస్తు..

తిరునాళ్లు ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం వేకువజాము వరకు నిర్విరామంగా జరగనున్నాయి. దీంతో ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య కారంచేడు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాట్లపై సమీక్షించారు. భక్తులు పెద్ద ఎత్తున రానున్నారనే సమాచారంతో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆయన వెంట ఏఎస్ఐ శేషసాయి, పోలీస్ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యువకుడిపై కత్తితో దాడి



రేపల్లె రూరల్: తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో ఓ యువకుడిపై మరో యువకుడు కత్తితో దాడి చేసిన సంఘటన ఇది. సీఐ మల్లికార్జునరావు కథనం ప్రకారం పట్టణంలోని 7వ వార్డుకు చెందిన దేవరపల్లి నవీన్‌కుమార్ బీఈడీ పూర్తి చేసి డీఎస్సీకి సిద్ధమవుతున్నాడు. అదే వార్డుకు చెందిన దేవరకొండ కోటేశ్వరరావు తన భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో శనివారం ఉదయం నవీన్‌కుమార్‌పై కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో నవీన్ తల, చేతులకు గాయాలయ్యాయి. కోటేశ్వరరావు ఘటనాస్థలం నుంచి పరారయ్యాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు నవీన్‌కుమార్‌ను ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్సకు గుంటూరు పంపారు. తల్లి స్వరూపరాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

జిల్లా ఖజానాధికారి కె శ్రీనివాసరావు



మాచర్లరూరల్: సమస్యల పరిష్కారానికి ట్రెజరీ శాఖ పెన్షనర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహిస్తామని జిల్లా ఖజానా శాఖాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో రిటైర్డ్ ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్స్‌కు, కుటుంబ సభ్యులకు అనేక సమస్యలున్నాయని, వారు ప్రతిసారీ కార్యాలయానికి రావటానికి ఇబ్బందిపడుతున్న విషయాన్ని తాము గుర్తించామని, వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తమ సబ్‌ట్రెజరీ అధికారి పెన్షనర్స్ దగ్గరకు వచ్చి సమావేశం నిర్వహించి అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించేలా తాము కృషి చేస్తామన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గాదె రామకృష్ణారావు మాట్లాడుతూ కుటుంబ పెన్షనర్లు క్వాంటం ఆఫ్ పెన్షన్ అమలులో జరుగుతున్న రికవరీ గురించి ఆందోళన చెందుతున్నారని, వాటిని సానుకూలంగా పరిష్కరించాలన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు నందా నరసింహయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామనాథశర్మ, సబ్ ట్రెజరర్ అధికారి రామానాయక్, నాయకులు గాలీబ్, కోటయ్య, నాసరయ్య, చంద్రయ్య, గౌస్‌మొహిద్దీన్, రఘుపతిరావు ఉన్నారు.

అలరించిన కళాంజలి నాటకోత్సవాలు



చీరాల అర్బన్: చీరాల కళాంజలి ఆధ్వర్యంలో ఐదురోజులు పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల జాతీయ నాటకోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. స్థానిక కస్తూరిభా గాంధీ మున్సిపల్ గరల్స్ హైస్కూల్ ఆవరణలో ప్రదర్శనలు నిర్వహించారు. శనివారం రాత్రి డాక్టర్ రాయని హనుమంతరావు కళావేదికపై విజయవాడకు చెందిన త్రిధారా ది ఆర్ట్స్ ల్యాండ్స్ వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన, శ్రీరామ పట్టాభిషేకం నృత్య రూపకం ప్రదర్శించారు. చిన్నారులచే ప్రదర్శించిన నృత్య ప్రదర్శన అందరిని అలరించింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత వడలి రాధాకృష్ణకు సత్కారం నిర్వహించారు. అలానే సహృదయ, ద్రోణాదుల వారిచే వర్క్ ఫ్రం హోమ్ హాస్య నాటికను ప్రదర్శించారు. నాటికకు రచన అద్దేపల్లి భరత్‌కుమార్, దర్శకత్వం డి.మహేంద్ర వ్యవహించారు. కార్యక్రమానికి ప్రేక్షకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఐదు రోజులు పాటు ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పలు సంస్థలు వారిచే నాటిక పోటీలను నిర్వహిస్తున్నట్లు కళాంజలి అధ్యక్ష, కార్యదర్శులు కోడూరి ఏకాంబరేశ్వరబాబు, సాంబశివరావులు తెలిపారు.

మేడికొండూరులో పోక్సో కేసు

మేడికొండూరు : మేడికొండూరు పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఓ పోక్సో కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మందపాడు గ్రామానికి చెందిన గంగోలు రాజు అదే గ్రామంలో నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 52 ఏళ్ల గంగోలు రాజుపై పోక్సో కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చీరాలలో కార్డెన్ సెర్చ్

- సరైన పత్రాలు లేని 33 ద్విచక్రవాహనాలు, ఆరు ఆటోలు సీజ్
- 5వేల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు, ఆటోలు

చీరాల: జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ మొయిన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం చీరాల టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామ్‌నగర్, న్యూకాలనీలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. చీరాల సబ్ డివిజన్‌కు చెందిన 150 మంది పోలీసులు పాల్గొన్నారు. నాటుసారా, ఇతర అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేసే ఉద్దేశంతో నిర్వహించిన కార్డెన్ సెర్చ్‌లో భాగంగా తీవ్ర గాలింపులు చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని 33 ద్విచక్రవాహనాలు, ఆరు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. భూమి లోపల గుంతలు తీసి డ్రమ్ములలో నిల్వ ఉంచిన 5 వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఎవరైనా చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడులలో చీరాల ఒన్‌టౌన్, టూటౌన్, ఈపూరుపాలెం, వేటపాలెం, ఇంకొల్లు, మేదరమెట్ల ఎస్సైలు, సబ్ డివిజన్‌లోని 150 మంది పోలీసులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ ద్వారా స్వయం ఉపాధి



మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు

కర్లపాలెం: మహిళలు కుట్టు మిషన్ నేర్చుకోవడం ద్వారా స్వయం ఉపాధి పొందగలుగుతారని బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. కర్లపాలెం పీకేఆర్ జూనియర్ కళాశాలలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈడీ మాట్లాడుతూ కుట్టు మిషన్ ద్వారా కుటుంబ సభ్యుల దుస్తులను కుట్టుకోవటంతోపాటు బయటి వారికి కుట్టటం ద్వారా ఆర్థికంగా లబ్ధి పొందవచ్చునని తెలిపారు. ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ ద్వారా సుమారు 144 మంది మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు 72 మందితో ఒక బ్యాచ్, మధ్యాహ్నం 1గంట నుంచి సాయంత్రం 4గంటల వరకు రెండో బ్యాచ్‌లో 72 మందికి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కుట్టు శిక్షణకు వచ్చే మహిళలకు ప్రతి రోజూ బయోమెట్రిక్ హాజరు ఉంటుందని, శిక్షణ ముగిసిన తరువాత ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తామని తెలిపారు.

హోరాహోరీగా అండర్-17 బాలుర వాలీబాల్ పోటీలు

సత్తెనపల్లి: పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ 54వ హైదరాబాద్ రీజియన్ స్థాయి అండర్-17 బాలుర వాలీబాల్ పోటీలు శనివారం హోరాహోరీగా ప్రారంభమయ్యాయి. పల్నాడు జిల్లా సత్తెనపల్లి (రామకృష్ణాపురం)లోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ ఆవరణలో అండర్ -17 బాలుర వాలీబాల్ పోటీలు లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహించారు. పోటీల్లో క్రీడాకారులు నువ్వా .. నేనా అన్నట్లు తలపడ్డారు. పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 18 జట్లు హాజరయ్యాయి. శనివారం రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుగులో కూడా పోటీలు కొనసాగించారు. ఎనిమిది జట్లు ఖమ్మం, సత్తెనపల్లి, హకీంపేట్, విజయవాడ-1, తెనాలి, వెంకటగిరి, వాల్తేరు, కర్నూల్ జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాయి. ఆదివారం క్వార్టర్ ఫైనల్, సెమీ ఫైనల్, ఫైనల్ పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించనున్నారు. అనంతరం విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం చేపడుతామని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ సత్తెనపల్లి ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ బి.కిరణ్‌రెడ్డి తెలిపారు. పంజాబ్‌లో జరిగే జాతీయస్థాయి వాలీబాల్ జట్టును కూడా ఇక్కడ ఎంపిక చేయనున్నారు. వాలీబాల్ పోటీలను వీక్షించేందుకు క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో రిఫరీలు తదితరులు పాల్గొన్నారు.



అరుణగిరి తండాలో మద్యం నిషేధించాలి



బల్లికురవ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైతో మాట్లాడుతున్న అరుణగిరి తండా మహిళలు



ఎస్సైకి వినతి పత్రం అందజేస్తున్న మహిళలు

అరుణగిరి తండా మహిళలు

బల్లికురవ: తండాలోని కిరాణా దుకాణంలో పగలు రాత్రి యథేచ్ఛగా మద్యం అమ్మకాలు చేపట్టటంతో తమ కుటుంబాలు ఛిద్రం అవుతున్నాయని అరుణగిరి తండా మహిళలు శనివారం బల్లికురవ ఎస్సై వై. నాగరాజు కు ఫిర్యాదు చేశారు. కొత్తూరు పంచాయితీ అరుణగిరి తండాలో సుమారు 130 కుటుంబాలు కూలీనాలీ పనులతో బతుకుతున్నారు. తండాలోని రామావత్ నాగమ్మ కిరణా దుకాణాన్నే బెల్టు షాపుగా మార్చుకుని మద్యం విక్రయిస్తున్నారని తెలిపారు. పురుషులంతా మద్యానికి బానిసై వేలకు వేలు ఖర్చు చేయటంతో పూట గడవటమే కష్టంగా ఉందని మహిళలు అంబోతి లక్ష్మీ భాయి, రామావత్ సీతమ్మభాయి, వడితా రమణీభాయి, మేడావత్ వాణీభాయి, రామావత్ స్వామి నాయక్, చిట్టిబాబు, మేడావత్ ప్రభురామ్‌నాయక్, హింసావత్ కిషోర్, మంగా నాయక్ తదితరుల వివరించారు. మద్యం అమ్మకాల కారణంగా తండాలో చిల్లర దొంగతనాలు అధికమవుతున్నాయని ఈ విషయాలను ఎక్సైజ్ శాఖ అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోవటం లేదని వెంటనే మద్యం అమ్మకాలకు చెక్‌పెట్టి తమ కుటుంబాలను ఆదుకోవాలని వినతి పత్రం అందజేశారు.

77 తాబేలు పిల్లలు సముద్రంలోకి విడుదల



తాబేలు పిల్లలను సముద్రంలోకి వదులుతున్న దృశ్యం

వేటపాలెం: వేటపాలెం మండలం పొట్టిసుబ్బపాలెం సముద్రతీర ప్రాంతంలోని తాబేళ్ల సంరక్షణ కేంద్ర నుంచి 77 ఆలీవ్ రెడ్లీ తాబేళ్ల పిల్లలను సురక్షితంగా సముద్రంలోకి శనివారం విడుదల చేశారు. ఉమ్మడి జిల్లా సమన్వయకర్త శనం చంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అటవీ శాఖ ట్రీ ఫౌండేషన్ ఐటీసీ బంగారు భవిష్యత్తు ద్వారా పొట్టిసుబ్బయ్యపాలెంలో ఏర్పాటు చేసిన సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రంలో 29 తల్లి తాబేళ్లు పెట్టిన 3,125 గుడ్లు సేకరించగా ఇప్పటి వరకు 2,210 బుల్లి ఆలీవ్ రెడ్లీ తాబేళ్ల పిల్లలను సురక్షితంగా సముద్రంలోనికి వదిలినట్లు తెలిపారు. జీవ వైవిధ్యం పరిరక్షణలో సముద్ర తాబేళ్ల సంరక్షణ ప్రధానమన్నారు. కార్యక్రమంలో ఎం వై సత్యనారాయణ, క్రాంతి, వెంకటేశ్వర్లు, తాబేళ్ల రక్షణ సభ్యులు జయరాం, వెంకటేష్ పాల్గొన్నారు.

ఉత్కంఠగా ఎడ్ల బండలాగుడు పోటీలు



పోటీల్లో బండలాగుతున్న ఎడ్ల జత

దాచేపల్లి: దాచేపల్లిలోని వీర్ల అంకమ్మతల్లి ఆలయ తిరునాళ్ల సందర్భంగా రాష్ట్ర స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు శనివారం హోరాహోరీగా సాగాయి. పాలపళ్ల విభాగంలో పల్నాడు జిల్లా అమరావతి మండలం జిడుగు గ్రామానికి చెందిన బీఎస్ఆర్ బుల్ భూపతి శ్రీనివాస్, నూసాయిపేటకి చెందిన గౌరు కార్తీకేయ సంయుక్త ఎడ్ల జత 4,250 అడుగుల దూరం బండ లాగి విజేతగా నిలిచాయి. పల్నాడు జిల్లా మాచవరం మండలం మోర్జంపాడుకు చెందిన కుర్రి గంగరాజు యాదవ్ ఎడ్ల జత 3,609 అడుగుల దూరం బండలాగి రెండో స్థానం, ఫిరంగిపురం మండలం కండ్రిక గ్రామానికి చెందిన కేలం పద్మనాయుడు ఎడ్లజత 3,580 అడుగుల దూరం బండలాగి మూడోస్థానం, బాపట్ల మండలం పాండురంగాపురానికి చెందిన కె.ఏడుకొండలురెడ్డి ఎడ్లజత 3,500 అడుగుల దూరం బండలాగి నాల్గవ స్థానం, ముప్పాళ్ల మండలం మాదల గ్రామానికి చెందిన యర్రంశెట్టి సుబ్బారావు ఎడ్లజత 3,369 అడుగుల దూరం బండలాగి ఐదవస్థానం, దాచేపల్లికి చెందిన యామర్తి శైలేంద్ర ఎడ్లజత 3,103 అడుగుల దూరం బండలాగి ఆరవ స్థానం, సూర్యాపేటకి చెందిన సురేష్, మాచవరం మండలం మల్లవోలుకి చెందిన దొప్పలపూడి మహిమ మణిరత్నం సంయుక్త ఎడ్లజత 2,800 అడుగుల దూరం బండలాగి ఏడవ స్థానంలో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ. 8 వేలు, రూ.7 వేలు, రూ.5 వేలు, రూ. 3వేలు చొప్పున నగదు, షీల్డ్స్‌ని బహూకరించారు.